


# దర్గామిట్టలో రొట్టెల పండగ తీరు

నెల్లూరు దర్గామిట్టకి రొట్టెల పండగొచ్చిందంటే మా ఊరికి ఎల్లవచ్చినట్టే లెక్క. మా ఊరనేంది... మా జిల్లా హోల్మొత్తానికీ ఎల్లవే.

ఆ పండక్కి జనం రావడమంటే చిన్నాచితకా జనం కాదు. పుట్ట పగిలి చీమలు బయిటికొస్తుళ్లా... అట్టా వుంటుంది చూడ్డానికి. బస్సుల్లో రైళ్లల్లో టార్పాల్ పట్టాలు కట్టిన లారీల్లో యాడాడి నుంచో దిగబడిపోతారు అందరూ. ఆడోళ్లయితే ఊర్లు ఖాళీ చేసేసినారా అన్నట్టుగా అన్ని చోట్ల నుంచీ వచ్చి నెల్లూరులో తేలతారు. ఎందుకంటే దర్గామిట్ట రొట్టెల

పండగలో మొక్కులు మొక్కేదీ, తీర్చేదీ ఆడోళ్లే.

రొట్టెల పండగరోజు నెల్లూరుకు పోయే రైళ్లలో ఒక్కడూ టికెట్టు అడగడు కాబట్టి మా అమ్మ మా నాయినమ్మనీ మమ్మల్నీ పిలచకపోతుంది నెల్లూరికి. మాతోపాటు మా పెదమ్మ, మా జరీనాంటీ కూడా వస్తారు మొక్కుల కోసం.

అందరం రొట్టెలు చేసుకొని, పులిహోర కట్టుకొని, చీకటితో పాసింజరు ఎక్కేసినామంటే బాగా ఎండొచ్చేసరికి నెల్లూరులో దిగిపోతాము. యింకాడి నుంచి దర్గా మిట్టకి నడిచేవోళ్లు నడుస్తారు. టౌనుబస్సులెక్కేవాళ్లు టౌనుబస్సులెక్కుతారు.

మా అమ్మ సంగతి తెలిసిందే కదా. మేము నడిచే వాళ్లం- రాదా మాదవా, నర్తకీ సినిమా హాళ్ల వాల్‌పోస్టర్లు చూసుకుంటా.

నెల్లూరుకి దక్షిణం తట్టు కళకళలాడతా వుండే నీళ్ల చెరువు గట్టున వుంటుంది దర్గా మిట్ట. దాని చుట్టూ మా పాతూరంతుండే పెద్ద మైదానం. నడిమధ్యన పన్నెండు మంది పీర్ల సమాదులుండే 'దర్గామిట్ట దర్గా'! దీనినే మేము 'బారా షహీద్ దర్గా' అంటాము. ('బారా' అంటే పన్నెండు. 'షహీద్' అంటే యుద్ధంలో వీరగతి పొందినోళ్లు).

దర్గామిట్ట దర్గాను చూస్తే బలే బయమూ బలే బక్తీ కలిగేవి నాకు. యీడ ఏ మొక్కు మొక్కుకున్నా తప్పకుండా తీరుతుందని మా నాయినమ్మ చెప్తా వుంటుంది. ఈ దర్గాకు ఒక కత వుందంట. ఆ కతను కూడా మా నాయినమ్మ చెప్పింది.

చానా వందల ఏళ్ల కిందట యాణ్ణో ఒక చోట మా మతాన్ని నిలబెట్టేదానికి బీకరమైన యుద్ధం జరిగిందట. ఆ యుద్ధంలో ఒక పన్నెండు మంది యోదానుయోదులు కత్తులు చేతపట్టి మా 'యీమాన్' కోసరం పోరాడినారంట. అయితే దుష్మన్‌లు ఆ పన్నెండు మందినీ చాటుగా మల్లుకొని తలలు ఎగరగొట్టేసినారంట. అయినాగానీ మా యోదులు యుద్ధం ఆపకుండా, కత్తి వదల కుండా, ఒట్టి మొండాలతో పోరాడతానే యిప్పుడున్న మిట్టదాకా వచ్చి, ఆణ్ణే పడి షహీదులయినారంట. అప్పుడు జనం ఆ పన్నెండు మంది మొండాలకి బక్తిగా సమాదులు కట్టి, దర్గా ఏర్పాటు చేసినారంట. ఆ దర్గా వున్న చోటే యిప్పుడు 'దర్గామిట్ట' అయ్యిందంట.

బారా షహీద్ దర్గాలో వున్న పన్నెండు మంది పీర్ల పేర్లు తెలియకపోయినా, వాళ్ల వూర్లు తెలియకపోయినా వాళ్లు చూపే మహిమ మాత్రం అందరికీ తెలిసిపొయ్యింది. అందుకని సాయిబులూ హిందువులూ అనే తేడా లాకుండా ఆడ జరిగే రొట్టెల పండక్కి విరగబడతా వుంటారు జనం.

ప్రతి సమచ్చరం పీర్ల పండగ (మొహర్రం) ముగిసిన రెండో రోజున దర్గామిట్టలో రొట్టెల పండగ జరుగుతుంది. ఈ పండగ సంగతి ఎవురూ ఎవరికీ చెప్పరు. క్యాలెండర్లో మొహర్రం ఎప్పుడో చూసుకొని దానికి రెండో రోజున ఆలిండియాలోని చాలా చోట్ల నుంచి జనం వచ్చేస్తారు.

ఎంత జనం వస్తారంటే కాలు పెట్టేదానికి కూడా సందుండదు దర్గామిట్టలో. మా అమ్మ జగత్‌కిలాడీ కాబట్టి యాణ్ణో ఒకదిక్కడ దుప్పటి పరిచి స్తావరం సంపాదిచ్చేస్తుంది ప్రతీసారీ. మమ్మల్ని మా నాయినమ్మకాణ్ణే కూచోపెట్టి, రొట్టెలు పట్టేదానికి మా పెదమ్మా జరినాంటీలతో కలిసి చెరువులోకి పోతుంది.

చేపలు పట్టడంలాగా రొట్టెలు పట్టడం ఏందా? అని అనుకోబాకండి. అసలు కతంతా ఆణ్ణే వుంది.

యీ రొట్టెల పండగలో 'మొక్కు మొక్కుకోవడం' అంటే ఆ మొక్కు పేరుతో వుండే 'రొట్టెను పట్టుకోవడం' అన్నమాట. మాటవరసకి మనింట్లో పెళ్లికాని పిల్ల వుందనుకోండి. ఆ పిల్లకి పెళ్లి కావడం మన మొక్కనుకోండి. అప్పుడు మనం 'పెళ్లి రొట్టె' పట్టి ఆ పిల్ల చేత తినిపించాలన్నమాట.

అట్టా పెళ్లి రొట్టెని పట్టాలంటే చెరువు నీళ్లలో మోకాలి లోతుకు దిగి, రెండు చేతులతో కొంగు సాపి 'మోప్! పెళ్లి రొట్టె వుందా?' అంటా అందర్నీ అడుక్కుంటా పోవాలి. అప్పుడు ఎవరో ఒకరు 'నా దగ్గిర వుందమ్మా పెళ్లిరొట్టె' అని, చెరువు నీళ్లకు కొంగు తడిసేంతగా కిందకి ఒంగి, ఆ నీళ్ల మీదుగా వాళ్ల దోసిట్లోని రొట్టెని మన దోసిట్లోకి బదలాయిస్తారు. దానిని పట్టుకోంగానే మనం మొక్కు మొక్కుకున్నోళ్లమవుతాం. (వీళ్లిట్టా పెళ్లిరొట్టె యిస్తా వున్నారంటే ఆల్రెడీ మొక్కు తీరిపోయినోళ్లు- అంటే పెళ్లి జరిగిపోయినోళ్లు- అని అర్ధం.

యీ పద్దతిలోనే రకరకాల రొట్టెలు విడిచేవాళ్లు (అంటే మొక్కులు తీరినవాళ్లు), రకరకాల రొట్టెలు పట్టేవాళ్లు (అంటే మొక్కులు తీరాల్సిన వాళ్లు) దర్గామిట్ట చెరువులోకి దిగి రొట్టెల కోసరం కలబడతా వుంటారు, యీ పండగరోజు.

మా అమ్మ ఎప్పుడు చూసినా రొట్టెలు పట్టే బ్యాచీలోనే వుండేదికాబట్టి ఎట్టాగయినా చేసి మాకు కావలసిన రొట్టెలన్నీ పట్టకొచ్చేది.

మా నాయినమ్మ కోసరం 'ఆరోగ్యం రొట్టె'. మా నాయిన కోసరం 'సంపాదన రొట్టె', 'ఐశ్వర్యం రొట్టె'. మా అన్న చదువు మానేసి కరెంటుపనిలో కష్టపడతా వున్నాడు కాబట్టి వాడికి 'సుఖం రొట్టె'. నాదసలే కాన్వెంట్ చదువు కాబట్టి నాకు మాత్రం 'చదువు రొట్టె'.

అందరికీ అన్నీ రొట్టెలూ పట్టినాక మా అమ్మ మాత్రం 'సౌబాగ్యం రొట్టె'ను పట్టుకొనొచ్చి తింటా కూచునేది.

మా అమ్మకి యీ రొట్టెలన్నీ కావాల్సుంటే మా జరీనాంటీకీ, మా పెదమ్మకీ వేరే రకం రొట్టెలు కావాల్సుండేవి.

మా పెదమ్మ బర్త బంగారంలాంటి బ్యాంకుద్యోగం పోంగొట్టుకొని, పొగాకు పండిస్తానంటా బయలు దేరి, వున్న డబ్బులన్నీ కానూకేసినాడు. అంతేగాక ఒకప్పుడు ఆయన మిలటరీలో పనిచేసినాడు కాబట్టి యవసాయంలో డబ్బులు కానూకింది చాలక, పొద్దుగూకితే చాలు బ్రాందీ షాపుకాడ తయారయ్యేవాడు. ఆయన సతాయింపులకి అల్లాడిపోతా ఉన్న మా పెదమ్మ ఆయనొక్కడు బాగు పడితే చాలు అదే పదివేలు అనుకుంటా ఆయన కోసరం మాత్రమే రొట్టెలు పడతా వుండేది.

మా జరినాంటీ అయితే సౌబాగ్యం రొట్టె, ఐశ్వర్యం రొట్టె లాంటి చిన్నాచితకా రొట్టెల జోలికి పోదు. ఆమెదంతా జాక్‌పాట్ వ్యవహారమే. చెరువు నీళ్లల్లోకి దిగి వెయ్యిమందిని కొంగుసాపి అడిగైనా సరే 'అదృష్టం రొట్టె' సంపాదిస్తుంది మా జరీనాంటి, లాటరీ తగలద్దేమోనని చెప్పి. (ఆ రొట్టె తిన్నప్పట్నించి రూపాయి రూపాయి పెట్టి బాగ్యలక్ష్మి స్టేటు లాటరీలు కొంటావుండేవాడు వాజిద్ సాయిబు).

ఆడోళ్లిట్టా ఎవురిక్కావాల్సిన రొట్టెలు వాళ్లు పట్టుకుంటా వుంటే ఆడోళ్ల తోడు లేని మొగోళ్ల బాద యింకో రకంగా వుండేది. పెళ్లికావాల్సినోళ్లు, ఉద్యోగాలు దొరకనోళ్లు ఆడోళ్ల చుట్టే తిరగతా 'మోవ్! రొంత పెళ్లి రొట్టుంటే యివ్వండమ్మా', 'రొంత ఉద్యోగం రొట్టుంటే పెట్టండమ్మా' అంటా బతిమిలాడుకుంటా వుండేవాళ్లు. కాటికి కాళ్లు సాపుకున్న ముసలోళ్లొచ్చి 'ఆయుష్షు రొట్టె' అడగతా అవుపించేవాళ్లు.

వీటన్నింటికంటే యమా డిమాండింగు వున్న రొట్టె మాత్రం సంతానం రొట్టె. బుకింగులో టికెట్టు కోసరం కొట్టుకున్నట్టుగా దీని కోసరం కొట్టుకుకునేవాళ్లు ఆడోళ్లు. యీడ సంతానం రొట్టె తింటే ఖాయంగా బిడ్డలు పుడతారని అందరి నమ్మకం.

మద్యానానికి రొట్టెలు విడవడం, రొట్టెలు పట్టడం పూర్తయినాక అందరూ కలిసి సినిమాలకి మల్లుకునే వాళ్లు. సుందర్ డీలక్సా? లీలామహలా? వినాయకా? అంటా ముందే డిస్కషన్లు చేసేవాళ్లు.

మేము కూడా మా పెదమ్మా జరీనాంటీలతో కలిసి సినిమా చూడటానికి కనకమహల్ కాడికెళ్లినాం. ఆ హాల్లో 'ఇల్లాలి కోరికలు' ఆడతా వుంది. దానెదురుగ్గా కొత్త హాలులో

'పట్నం వచ్చిన పతివర్తలు' ఆడతా వుంది. రెండు హాళ్లకీ కిటకిటలాడతా ఉన్నారు జనం.

'దీనికి పోదాం పదకా' అనింది మాఅమ్మ, మా పెదమ్మకు 'పట్నం వచ్చిన పతివర్తలు' వాల్‌పోస్టరు తట్టు చూపిస్తా.

'నేను రానమ్మో. దీనికే పోదాం పదండి. శోబనుబాబు, జయసుద బలే చేస్తారు. జయసుద యిందులో మొగుణ్ణి ఒదిలేస్తుందంట' అనింది మా పెదమ్మ, 'ఇల్లాలి కోరికలు' వాల్‌పోస్టరు చూపిస్తా.

'అది ఏడుపు సినిమా అకా. దీనికి రాకా' అనింది మా జరీనాంటీ.

మా పెదమ్మ కదల్లా.

'ఎన్ని రొట్టెలు పట్టినా నా కోరికలు ఎట్టా తీరడంలేదుగానీ యిట్టా యీ కోరికన్నా తీరనీండమ్మా' అనింది. అన్నాక ఇల్లాలి కోరికలకే టికెట్లు కోయించుకుంది.

